# నేను-నాదేశం

-గంటి భానుమతి

విక్టోరియా మహారాణి మన దేశాన్ని చాలాకాలం ఏలాక, ఆవిడ పోతే, ఏడో ఎడ్వర్డు ఏలారుట. పాపం... ఆయన ఎక్కువ కాలం చక్రవర్తిగా ఉండకుండానే పోయారుట. ఆ తర్వాత, ఐదో జార్జిగారు చక్రవర్తి అయ్యారు. లండన్‌లో ఆయన పట్టాభిషేక ఉత్సవాలు అవీ పెద్ద ఎత్తున జరిగాయట. ఇదంతా 1910 సంవత్సరం నాటి మాట.

ఆ తర్వాత కొన్ని రోజులయ్యాక, ఆ చక్రవర్తి గారికి, మన దేశానికి విచ్చేయాలన్న కోరిక కల్గిందిట. రాజుగారు తల్చుకున్నారు. యింక కొదవ దేనికి? జార్జిగారు కోరిక తీర్చదలిచారుట.

ఆ రోజుల్లో మన దేశంలో చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలు బోల్డుండేవిట. వాళ్ళల్లో కొంతమందిని లండన్‌కే ఉత్సవాలు చూడ్డానికి పిలిచారు. కొంత మందిని ఢిల్లీలో జరిగిన రాజసూయ యాగానికి పిలిచారుట.

లండన్, ఢిల్లీ వెళ్ళలేని వాళ్ళు ఎవరి రాజ్యాల్లో వాళ్ళు వేడుకలు జరుపుకున్నారుట. అయితే ఢిల్లీ రాజసూయ యాగానికి వెళ్ళి ఆయన సార్వభౌమత్వానికి సలాములు చేసినవాళ్ళల్లో మన ఆంధ్రా వాళ్ళు, నిజాముగారు కూడా ఉన్నారుట. ఇవన్నీ కూడా ప్రచీన నవీన ఢిల్లీ సామ్రాజ్య చరిత్రలో చదివాను.

ఆ తర్వాత, అంటే మనకు స్వాతంత్ర్యం వచ్చాక, ఈ చిన్న చిన్న రాజ్యాలన్నింటివీ, ఎల్లలూ, సరిహద్దులు, రాజకీయ భౌగోళిక స్వరూపాలు మారిపోతూంటే, ప్రాంతీయ భూభాగాలన్నీ ద్వీపాలుగా చీలిపోతూంటే, పాపం సర్దార్ పటేల్‌గారు, నానాకష్టాలు, తంటాలు, తిప్పలూ పడి, అక్కడా యిక్కడా సద్ది, రాష్ట్రాలుగా రూపాంతరం చేయడానికి చాలా కృషిచేశారు.

మనమంతా ఒక్కటే. మనమంతా భారతీయులం అని మన రాజ్యాంగం మనకి చెప్తున్నా, ఎవరి ఊళ్ళు వాళ్ళకి దేశాలు ఎవరి దేశం మీద వాళ్ళకి అభిమానం ఉంటుందన్న సంగతి నాకు పెళ్ళయిన కొత్తలో తెలిసింది.

నా పెళ్ళయిన కొత్తలో బొంబాయిలోని డోంచివిల్లిలో ఉన్నాను. ఓ రోజున పాలవాడు, పాలు పోయడం అయిపోయాక అన్నాడు.

"రేపట్నించి నేను రాను. వేరే ఎవరితోనయినా పోయించుకోండి" అని.

కంగారు పడ్డాను. వెంటనే ఏ ఫ్లాట్ వాళ్ళని అడగాలి? అని.

"అదేం? ఎందుకు రావూ?"

"మా దేస్ వెళ్తున్నాను" వాడి కళ్ళల్లో, మాటల్లో గర్వం. దేస్.. దేస్ ఏఁవిటీ? వాడి మొహం చూస్తూంటే ఏదో విదేశీయుడు యిక్కడ సెటిల్ అయినట్లు లేదు.

బొంబాయిలో మామూలుగా సైకిళ్ళ మీద, సువేగాల మీద వచ్చి పాలుపోసే భయ్యాజీ లాగానే ఉన్నాడు.

అయినా, వీడి 'దేస్' ఏదో కనుక్కుందామన్న కుతూహలం కలిగింది. వెంటనే అడిగేశాను.

"అయితే నీ 'దేస్' ఏది? ఏ దేశం వెళ్తున్నావూ?"

"ఉత్తరప్రదేస్. నేను యూ.పి. వాడిని. గంగా కినారే వాలా..."

హార్నీ! ఇక్కడివాడివేనా! అయినా నీకు బొంబాయి పరదేశమా! కన్యాకుమారి నుంచి కాశ్మీరం వరకూ విశాలంగా ఉన్న మన దేశంలో తూర్పు వైపున ఉన్న ఈ గంగా కినారా చోరాకి బొంబాయి పరదేశం అయిందన్నమాట.

అయినా వాడి స్వదేశ ప్రేమని చూసి ముచ్చట పడ్డాను. మహా, మహా రాఁవులారే, జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసీ.. అని అనుకున్నారు. అలాంటప్పుడు, ఇంక ఈ మానవ మాత్రుడైన భయ్యాజీ ఎంత...!

సరే... పాలవాడంటే అజ్ఞాని. పెద్దగా చదువుకున్న వాడు కాదు. బొత్తిగా చిన్న పల్లెటూరు నుంచి వచ్చిన వాడు. దానిలో అర్థం ఉంది. కానీ, ఆధునిక జీవనం గడుపుతున్న మానవమాత్రులు కూడా అంతేనన్న సంగతి, భిలాయి దగ్గరున్న ఓ సిమెంటు ఫాక్టరీలో ఉండడం మొదలెట్టాకా తెలిసింది.

మా యింటి పక్కనే ఉండే మిసెస్ కొఠారీ "మా దేస్ వెళ్తున్నాం. పాలవాడికి, పేపరు వాడికి చెప్పడం మర్చిపోయాను. కొంచెం రేపు వాళ్ళతో చెప్పండి..."

"అంత హఠాత్తుగా ప్రయాణం కట్టారేం?"

"జోధ్‌పూర్ నుంచి, సవాయ్ మాధోపూర్ నుంచి రెండు మంఛి సంబంధాలు వచ్చాయిట. మా 'నిష్ఠ'ని తీసుకెళ్తున్నాం. పెళ్ళి కుదిరిందంటే మా 'దేస్'లో చేసి, పార్టీ యిక్కడ యిస్తాం..."

మిసెస్ కొఠారీ పెళ్ళయిన వెంటనే ఈ ఫాక్టరీకే వచ్చిందిట. పిల్లలు యిక్కడే పుట్టారు. వాళ్ళ చదువులు భిలాయ్, రాయపూర్, దుర్గ్‌లోనే పూర్తయ్యాయి. అయినా అన్నం పెట్టిన ఈ ఛత్తీస్‌ఘడ్‌ని తన దేశంగా ఆమె అంగీకరించలేకపోయింది.

ఆ తర్వాత గుజరాత్ వెళ్ళాం. మా ఎదురు ఫ్లాట్‌లో ఉండే ఈళాబేన్ ఓ వారం రోజుల తర్వాత, మా యింటికొచ్చింది ఇంగ్లీషు మాట్లాడ్డం నేర్పించమని. ఆమె గుజరాతీలో అడిగింది.

సరే చూద్దాంలే అన్నాను.

మర్నాడు ఓ పొడుగాటి పుస్తకం తీసుకొచ్చింది. క్లాసు మొదలుపెట్టినప్పటికి కానీ నాకు తెలియలేదు. ఆమెకు హిందీ రాదు, నాకు గుజరాతీ రాదు. ఇంక ఎలా! ఒక్క వాక్యం కూడా సాగలేదు.

ఆ తర్వాత ఆదివారం జామ్‌నగర్ వెళ్ళి, వెస్ట్ ఇండియా దుకాణంలో గుజరాతీ-ఇంగ్లీషు ముప్పయి రోజుల్లో నేర్చుకోండి అన్న పుస్తకాన్ని కొన్నాను.

ఆ తర్వాత ఈళాబెన్ నాకు ఓ అరగంట గుజరాతీ, నేను ఆమెకు ఓ అరగంట ఇంగ్లీషు, ఇలా యిద్దరం ఒకరికొకరం గురువులం అయిపోయాం.

ఓ నెల రోజులు కూడా కాకముందే, ఈళాబేన్ మొగుడు ఈ ఫాక్టరీ వదిలేసి 'కొడినార్' వెళ్ళిపోతున్నారని తెలిసింది.

"అవును, మేం వెళ్ళిపోతున్నాం. అది మా దేస్‌కి చాలా దగ్గర..."

'దేస్' అంటే తెలిసిపోయింది కాబట్టి వెంటనే అడిగాను ఏ దేశం అని. 'వేరావల్' అని గర్వంగా చెప్పింది. అది 'అంబానీ' వాళ్ళ ఊరని అంతే గర్వంగా చెప్పింది.

ఒక్కోసారి నాకనిపించేది నాకు నా దేశం మీద ప్రేమ లేదా! ఇలా ఈ చిన్న చిన్న దేశాలు పట్టుకుని తిరుగుతున్నాం ఏఁవిటీ?

## ప్రేమమందిరం!

కనువిందుగొలిపే
కమనీయ ప్రకృతి దృశ్యాలు..!
మైమరపించే చల్లని
మలయ పవనాలు..!
మధుర స్వప్నాలలో
తేలియాడే అంతరంగాలు..!
సిరిసిరి మువ్వల నాట్య
విన్యాసాల రవళులు..!
సాగర తీరాన సప్తస్వరాల
సుమధుర రాగాలాపనలు..!
మన్మథుని శృంగార సంకేతాలతో
పరవశించె ప్రేయసీ ప్రియులు..!
వేదమంత్రాల సాక్షిగా
కళ్యాణ వేడుకల సంబరాలు..!
సిగలో విరిసిన మల్లెపువ్వుల
గుబాళింపుల తన్మయత్వంలో
ఓరచూపుల వయ్యారాలతో
అరుదెంచే అర్ధాంగి హొయలు..!
వేయి కన్నులతో నిరీక్షించే
నవ మన్మథుని మదనోల్లాసం..!
అనుక్షణం వలపు కౌగిలిలో
కరిగిపోవాలనే కుతూహలం..!
నూతన వధూవరులకు అదొక
శృంగార శయన మందిరం..!
సాగర తీరాన ఎగసిపడే
అలల తరంగాల ఘోషను
ఆస్వాదించే మధురానుభూతులు..!
సంధ్యా సమయాన విరబూసిన
చంద్రోదయ దర్శనభాగ్యం..!
అనురాగమయ దాంపత్య జీవితంలో
అది వారు అపురూపంగా
నిర్మించుకున్న ఓ 'ప్రేమమందిరం'..!!

-తంగెళ్ల పాండురంగశర్మ

మా వారితో పోట్లాడ్డం మొదలెట్టాను. మనం మన దేశం వెళ్ళిపోదాం. పిల్లలకి నాలుగు తెలుగు ముక్కలు రాయడం అయినా వస్తుంది.

ఆ ఫాక్టరీ వదిలేసి, నల్లగొండ జిల్లాలోని ఓ సిమెంట్ ఫాక్టరీకి వెళ్ళాం.

మావారి డిపార్టుమెంటులో పనిచేసే కుట్టి, సెలవల్లో కేరళా నుంచి ఫామిలీని తీసుకొచ్చాడు. కాలనీ స్కూల్లోనే చదువుతారుట. అందుకని తెలుగు నేర్పించమని నన్ను ప్రాధేయపడ్డాడు.

కుట్టికి తెలుగు రాదు. హిందీ రాదు. ఇంగ్లీషు, అరవం వచ్చు. నాక్కూడా అరవం వచ్చు కాబట్టి, పిల్లలకి చెప్పడంలో కష్టం ఉండదని అన్నాడు.

చిన్న పిల్లలే కాబట్టి సాయం పట్టేసాను. స్కూళ్ళు తెరిచేనాటికి పదాలు చదివే స్థాయికొచ్చారు.

ఓ రోజున రెండో క్లాసు చదువుతున్న పెద్ద పిల్లకి మనదేశం అనే పాఠంలోని పదాలు, అర్థాలు రాయించి, పాఠం గట్టిగా చదవమన్నాను.

"నా దేశం భారతదేశము. మనమందరమూ భారతీయులం. ఇది ఒక గొప్పదేశము..." అంటూ ఆగింది.

"ఆంటీ.. గొప్ప.. అంటే ఏంటి? అర్థం రాసుకుంటాను"

తడబడ్డాను. "గొప్ప అంటే... అన్నింటికన్నా..." ఆగిపోయాను.

"యిష్టమైన..." సరిగ్గా చెప్పానా అన్నట్లు తల ఊపింది.

ఆ కళ్ళల్లో దేశం యొక్క గొప్పదనం కునుక్కున్నానన్న గర్వం తొణికిసలాడింది.

నిజమే... ఎవరి దేశం వాళ్ళకి యిష్టమైన గొప్ప దేశం. ఆ తర్వాత భిన్నత్వంలో ఏకత్వం అన్న పదాల్ని-అతి కష్టంమీద కూడబలుక్కుని చదివి, నా మొహంలోకి చూసింది అంటే ఏంటిటన్నట్లుగా.

"మనదేశంలో, యిన్ని చిన్న చిన్న దేశాలున్నాయి కదా... అన్ని దేశాలు కలిపి ఓ పెద్ద దేశం అన్నమాట..."

"వాటిని రాష్ట్రాలంటారు కదా, దేశం అంటారా!" అని ఇంగ్లీషులో అడిగింది. "దేశాలు అని అనరు... కదా... ఆంటీ!"

నిజమే. నీలాగా చదువుకునే వయసులో రాష్ట్రం అంటే రాష్ట్రం అని అనుకున్నాను. కానీ, ఎవరి రాష్ట్రం వాళ్ళకి దేశం అన్న సంగతి పెద్దయ్యాకానే తెలిసింది.

ప్రతీ రాష్ట్రం ఓ చిన్న దేశం. మళ్ళా ఆ దేశంలో యింకా చిన్న చిన్న దేశాలు కావాలని ఆందోళనలు, ఉద్యమాలు. ఆఖరికి దేవుడి గుడికి భూమి యివ్వడానికి కూడా నిరాకరిస్తున్న దేశాలున్నాయి.

స్వాతంత్ర్యం రాకముందు ఎన్ని చిన్న దేశాలున్నాయో, ఎన్ని రాజ్యాలున్నాయో అన్ని దేశాలూ, రాజ్యాలూ వస్తాయని, చరిత్ర పునరావృతం అవుతుందని, మన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ సవరించాల్సి వస్తుందని, అప్పుడందరి కన్నా బలవంతుడైన వాడు ఓ రాజసూయ యాగం చేయడానికి అవకాశం ఉందని, ఆ బలవంతుడికి భయపడి సలాము చేసే చిన్న చిన్న రాజ్యాలుంటాయని... యిలా ఇంకా... ఏదో... ఏదో చెప్పాలని పించినా, ఆ పిల్లకది అర్థంకాదని ఊరుకున్నాను. ■

# మోటపాటలు-తీరుతెన్నులు

**-డాక్టర్ బూర్గుల కేశవులు**

**క**థకు ప్రాముఖ్యం కాకపోవడమే మోట పాటల ప్రధాన లక్షణం. అంచేత వీనిని ముక్తకాలుగా పేర్కొన వచ్చు. జానపదుడొక దృశ్యాన్ని చూసేటప్పుడు అతని మనోభావాలు విజృంభిస్తాయి. ఆ భావాలే అప్రయత్నంగా కథారహితమైన గేయ రూపాలు. ఈ గేయ రూపంలోని మోట పాటలకు ప్రత్యేక లక్షణాలున్నాయి.

**శ్రమను బట్టి పాట రాగస్థాయి**

మోటకొట్టేప్పుడు తొండెం తాడు పైకి లేపడం లేదా మోకును కిందకు వత్తడం వంటి మనిషి చేసే శ్రమనుబట్టి రాగముంటుంది. మోట బారు యొక్క దూరాన్ని బట్టి నిండు బొక్కెనతో ముందుకు పోయినప్పుడు రాగస్థాయి నడుస్తుంది.

ఆకలేమో అయినది
రోకలేమో ఎత్తలేనూ
సూరు కిందికి రారకోడా – ఓరీ పిల్లగా
సూసుకుంటా దంచుదామూ

మోట పనిలో ఒకసారి నీరు తోడటానికి తగినట్లుగా పాట పూర్తవుతుంది. నిండు బొక్కెనతో పాట పాడుతూ బారు చివరకు పోయి నీళ్లు వెళ్లతోడి వచ్చునంతలో పాట పూర్తవుతుంది.

మోట పాటలో ప్రధానంగా మూడు లేక నాలుగు పాదాలుంటాయి. మోట పాటలోని భావం మూడు పాదాల్లోను లేదా నాలుగు పాదాలతో ఉండాలి.

బొట్ల బొట్లా నీర గటూకా
బోద బండకూ నేను వోతే–
బోద బండ బోయవాడూ – ఓరయ్యా పిల్లగా
బొట్ల సీరా వట్లు కట్టే.
సిన్న పిల్లగా దనుకోనీ
సీర విడిసీ కుప్ప వెడితే
సిన్న పాయం సిదుమగుద్యా – సిన్న పిల్లగా
బాల పాయం కదులగుద్యా.

**మోట పాటలు పురుష కర్తృత్వాలు:**

మోట పాటల్ని పురుషులు మాత్రమే కయి కట్టి గానం చేస్తారు.

సీటి సీరాకట్టుకోనీ
నిమ్మ పరిగాలేరవోతే
నిమ్మ ముల్లూ రొమ్ముతగిలే– ఓరన్నా పిల్లగా
రైక మూడీ రక్తమయ్యే.

రెండు పాదాల పురుషుడు మిగిలిన రెండూ పాదాలు స్త్రీ పాడినట్లుంటాయి.

పాట పాడేది పురుషుడు అయినా రెండు పాదాలు తాను పాడినట్లుగా మిగిలిన రెండు పాదాలు ప్రియురాలు పాడినట్లుంటాయి.

అంగడివోయే సింగడి పాపా
గొంగడిస్తా తాకనీయే
గొంగడి గోడల్ల వాడో – సిన్నవాడో
అంగడికీ పొద్దువోవో.

పురుషుని ప్రశ్నకు స్త్రీ సమాధానంగా వుంటుంది. పురుషుడు పాడే పాట ప్రియురాలిని దృష్టిలో ఉంచుకుని ఆమెతో సరసమాడుతున్నట్లుంటాయి. అందుకామె బదులిచ్చినట్టు ఉంటుంది.

ఎదమీదా రొమ్ములేదూ
రొయ్యగలవాడిదానా
దాకజేయ్యకూ లేతనడూమూ – ఓరీ పిల్లగా
దాకలాకుతాలలేను.

**మోటపాటల్లో అసభ్య శృంగారమే ప్రధానం:**

మోట కొట్టే వ్యక్తి ఏకాంతంగా విరహ బాధను, రాత్రి సమయం కావడంతో బూతు శృంగారాన్నీ గానం చేస్తాడు.

అంత రాన రావో మేదానీ
మంత రాన రాయల పవలే
బాసలు జేసినా ఆడిదానీ – సిన్నవాడ
బాటలు కాసి కులకవలే.

**మోట పాటలు ముక్తకాలు:**

మోట పాటలోని భావం ఏ పాదానికి ఆ పాదం అర్థం కలిగి ఉంటుంది. మొదట పాదానికి ఉండే అర్థం రెండో పాదానికి అన్వయించదు. గాథాసప్తశతి గాథలవలె ఉంటాయి.

నెమిలిని జంపీ నంజుడుదేరా
గండు జీమలాగుండెలు దేరా
ఈగవాలనీతేనెదేరా – ఓరి పిల్లగా
ఈననావు లావేయిదేరా.

**రెండో పాదానికి మూడో పాదానికి చివర సంబోధన పదాలుంటాయి:**

మోట పాటలకు రెండో పాదానికి చివర సంబోధన పదం అరుదుగా ఉంటుంది. మూడవ పాదానికి మాత్రం సాధారణంగా ఉంటుంది.

దుమ్ము తగిలిరా, దూపగోన్నా
దమిలేటరా, నీళ్ళు దేరో – అయ్యో పిల్లగా
మాయదారీ దప్పిగోన్నే – నాసారవాడా
మాపటాపులా పాలుదేరో

సిన్నవాడ! సిన్నపిల్లగో! సిన్నదానా! ఓరి పిల్లగా! వయ్యారి పిల్లగా! ఓరీ జాన! ఏనియాల! సోరవాడ! దుడ్డెవాడ! బుడ్డోడ!? ఓరికోడే! మున్నగు పదాలుంటాయి.

**మోట పాటలలో స్త్రీ భావముంటుంది:**

పురుషుడు తన ప్రియురాలితో ఏ సమయంలో అదే సమయంలో మోటపనికి పోతాడు. అతడు ప్రియురాలి మీద ప్రేమతో అంగాంగ వర్ణన చేస్తాడు. తాను పొందిన సుఖభోగాలను గూర్చి పాటగా పాడుకుంటాడు.

గుమ్మ సందెదురా, గుబ్బల నడుమా
ఎంటికలురా ఎసుకొని – నాసోరవాడ
మరిసి నిదురలూ వడెగుమ్మా – అయ్యో పిల్లగా
తడిసి మెలుకలూ ఎల్లనయ్యో

ఈ విధంగా మోట పాటల తీరుతెన్నులు విశదీకరించబడ్డాయి. ■